Namasthe Telangana Dt- 18/02/17.

# చెప్పిన టైంకే మెట్రో ప్రయాణం

**ప్రయాణికులకు చేరువలో రైలు**
**జూన్‌లో ప్రారంభానికి సిద్ధమవుతున్న ప్రాజెక్టు**



సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చేందుకు హైదరాబాద్ మెట్రోరైలు దాదాపు సిద్ధమైంది. ఐదు సంవత్సరాల కాలపరిమితితో కూడిన ఒప్పందం ప్రకారం ప్రాజెక్టును పూర్తిచేసి వచ్చే జూన్‌లో ఆపరేషన్స్ ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపాదికన పనులు పూర్తి చేస్తున్నారు. 72 కిలోమీటర్ల పొడవుతో మూడు కారిడార్లుగా విభజించి చేపట్టిన ఈ పనుల్లో ఇప్పటి వరకు దాదాపు 62 కిలోమీటర్ల పనులు దాదాపు పూర్తయ్యే దశకు వచ్చాయి. 2010 సెప్టెంబర్‌న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒప్పందం కుదుర్చుకుని జూన్ 2012లో పనులకు శ్రీకారం చుట్టారు. అనేక ఆటంకాలు ఎదురైనా..ఇచ్చిన మాట ప్రకారం పక్కాగా పట్టాలెక్కించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు పరుస్తున్నారు.

**రెండు కారిడార్లలో 56 కిలోమీటర్ల ఆపరేషన్స్**

ఒప్పందంలో భాగంగా ప్రకటించిన కాలంలోపే హైదరాబాద్ మెట్రోరైల్ ఆపరేషన్స్ ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. అందులో భాగంగా కారిడార్-1లోని మియాపూర్ నుంచి ఎస్ఆర్ నగర్ వరకు 29 కిలోమీటర్లు ఉండగా అందులో 11 కిలోమీటర్లు ఆపరేషన్స్ జరిపేందుకు సిద్ధంగా ఉన్నాయి. నాగోల్ నుంచి రాయదుర్గం వరకు 3వ కారిడార్ 28 కిలోమీటర్లు ఉండగా అందులో నాగోల్ నుంచి బేగంపేట వరకు 16 కిలోమీటర్ల లైను, స్టేషన్లు పూర్తయ్యాయి. వీటిని జూన్‌లో ప్రారంభించనున్నారు. సంవత్సరం చివరినాటికి ఈ రెండు కారిడార్లు కలిపి 56 కిలోమీటర్ల మేర ప్రయాణికులను అధికారికంగా చేరవేసేందుకు అవసరమైన పనులు చేపట్టారు. కారిడార్-2 పనులను వచ్చే సంవత్సరం ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని మెట్రోరైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో ఎటువంటి సందేహాలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మెట్రోరైలు ఆపరేషన్స్ ప్రారంభించడంలో ఎటువంటి జాప్యం జరగదని తెలిపారు.

**ప్రభుత్వం ప్రత్యేక దృష్టి, సమీక్షలు**

ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి కేసీఆర్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ దీనిపై సమీక్షలు చేస్తూ ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఆర్వోబీల నిర్మాణంలో రైల్వే అనుమతులు ఆలస్యం కావడం వల్ల కూడా ఈ ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తేవాలన్న సంకల్పం ప్రభుత్వానికి ఉండటంతో ..ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ప్రాజెక్టు పనులను మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వేగవంతం చేశారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తిచేయగా 25 శాతం పనులు మిగిలి ఉన్నాయి. అందులో అధికశాతం ఓల్డ్ సిటీకి సంబంధించిన పనులే ఉన్నాయి. నాగోలు -మెట్టుగూడ, మియాపూర్-ఎస్సార్‌నగర్ మార్గాలు ఇప్పటికే పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండు మార్గాలకు భద్రతా పరమైన (సీఎంఆర్ఎస్) అనుమతులు కూడా లభించాయి. అంతేగాకుండా రైళ్లను కూడా ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నారు. 72 కి.మీటర్ల ప్రాజెక్టులో 61.20 కిలోమీటర్ల మేర పునాదులు, 58.10 కి.మీ మేర స్తంభాలు, 38.25 కి.మీ ట్రాక్‌లు పూర్తయ్యాయి. అమీర్‌పేట, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్స్ వద్ద మూడు ఇంటర్ ఛేంజ్ స్టేషన్లతో పాటు 30 చోట్ల స్టేషన్ల పనులు పురోగతిలో ఉన్నా యి. చాలా చోట్ల స్టేషన్ల పనులు పూర్తయ్యాయి.

**ఊపందుకున్న కారిడార్-2 పనులు**

మొదటి నుంచి వివాదస్పదమైన మెట్రో కారిడార్-2 పనులు కూడా ఊపందుకున్నాయి. ప్రజల నుం చి ఈ ప్రాజెక్టు కావాలని ఒత్తిడి ఎక్కువ కావడంతో ఈ ప్రాజెక్టు పనులు వేగవంతమవుతాయని భావిస్తున్నారు. మెట్రో కారిడార్-2 నిర్మాణంలో భాగంగా జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 15.19 కిలోమీటర్ల నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఇందులో అగ్రభాగం పనులు చకచకా జరుగుతున్నాయి. జేబీఎస్ నుంచి ఇమ్లిబన్ వరకు పనులు అత్యంత వేగవంతగా జరుగుతుండగా ఇమ్లిబన్ నుంచి ఫలక్‌నుమా వరకు కేవలం 5.5 కిలోమీటర్ల మేర పనులు మాత్రం చేపట్టాల్సి ఉంది. సుల్తాన్‌బజార్, కోఠి వంటి వివాదస్పధ ప్రాంతాల్లో కూడా పనులు చేపడ్తున్న హెచ్‌ఎంఆర్..పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని పట్టుదలతో ఉంది. జాప్యం జరుగుతుందన్న ప్రచారానికి పనులతో సమాధానం చెప్పాలనే యోచనలో ఎండీ ఉన్నారు.